## క్లుప్తంగా

### ప్రవచనాల ద్వారా ఆధ్యాత్మిక తత్వం


ప్రవచనం చేస్తున్న సుమంతాచార్ పాటిల్

బోట్‌క్లబ్: ప్రవచనాల ద్వారా ఆధ్యాత్మిక తత్వం అవగాహన చేసుకోవడానికి వీలుంటుందని విజయవాడ ఉత్తరాది మఠాధికారి సుధాపండితుడు సుమంతాచార్ పాటిల్ అన్నారు. స్థానిక రామారావుపేటలోని మధ్వసభ ప్రాంగణంలో మూడు రోజుల పాటు జరిగే ఆధ్యాత్మిక ప్రవచనాన్ని బుధవారం ప్రారంభించారు. ఉత్తరాధి మఠాధీశులు సత్యాత్మతీర్థ స్వామిజీ ఆజ్ఞానుసారం తమ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో జ్ఞానయజ్ఞాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. సుమంతాచార్‌ను మధ్వకమిటీ అధ్యక్షులు రాచూరి రాఘవేంద్రస్వామి, కార్యదర్శి కోపెల్లి శేషగిరిరావు భారీ గజమాలతో సత్కరించారు.

### కన్నబాబుకు విలేకరుల ధన్యవాదాలు


ఎమ్మెల్యే కన్నబాబును సత్కరిస్తున్న విలేకరులు

కాకినాడ రూరల్: ఏపీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో విలేకరులు ఎమ్మెల్యే కురసాల కన్నబాబుకు ధన్యవాదాలు తెలియజేశారు. విలేకరులకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు కేబినెట్‌లో ఆమోదించడంపై వారు హర్షం వ్యక్తం చేసి, త్వరగా స్థలాలు ఇచ్చేలా చూడాలని కోరారు. ఏపీ డబ్ల్యూఎఫ్ జిల్లా నాయకత్వం ఆధ్వర్యంలో రమణయ్యపేట క్యాంపు కార్యాలయం వద్ద బుధవారం కన్నబాబును సత్కరించారు. కన్నబాబు మాట్లాడుతూ సీఎం జగన్ ఇచ్చిన హామీ మేరకు వారికి ఇళ్ల స్థలాలు ఇచ్చే ప్రక్రియ వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. యూనియన్ నేతలు నవీన్‌రాజ్, ముమ్మిడి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక దినపత్రికల ప్రతినిధులు రాయవరపు ప్రభాకర్, ఆకెళ్ల శ్రీనివాస్, సుకుమార్, ప్రకాష్, బిందాన సురేష్ తదితరులు కన్నబాబును సత్కరించారు.

### ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు క్షమాపణ చెప్పాలి


మాట్లాడుతున్న జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ. చిత్రంలో గీసాల శ్రీను, బందిలి వీరీష తదితరులు

కాకినాడ రూరల్: సామాజిక సాధికార బస్సు యాత్ర విజయవంతం కావడంతో ఓర్వలేని టీడీపీ నేతలు సర్పవరం జంక్షన్‌లో పసుపు నీళ్లు చల్లి, ఎన్టీఆర్ విగ్రహానికి శుద్ధి చేసి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను అవమానించారని జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, ఏఎంసీ చైర్మన్ గీసాల శ్రీను, వైస్ ఎంపీపీ బందిలి వీరీష పేర్కొన్నారు. రమణయ్యపేటలో వైద్యనగర్ క్యాంపు కార్యాలయం వద్ద మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ మంగళవారం సర్పవరం జంక్షన్‌లో శుద్ధి చేసిన నేతలు ఆయా వర్గాలకు క్షమాపణ చెప్పాలన్నారు. తమ సాధికారత కోసం జరిగిన బస్సుయాత్రపై బురద చల్లాలని చూస్తున్న వారికి తగిన బుద్ధి చెబుతామని వారు పేర్కొన్నారు. సమావేశంలో గగారిన్ తదితరులు పాల్గొన్నారు.

### ఎవరి దారి వారిది!


ట్రాఫిక్ డీఎస్పీ కార్యాలయం ఉన్న త్రీ టౌన్ ఎదురుగా రహదారిపై తిష్ట వేసిన పశువులు

కాకినాడ క్రైం: పెరుగుతున్న జనాభాకి తోడు నగరంలో వాహనాల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ఈ నేపథ్యంలో ట్రాఫిక్ సమస్య నానాటికీ జటిలమవుతోంది. పశువుల వల్ల ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ట్రాఫిక్ పోలీసులు, మున్సిపల్ విభాగం సమన్వయ లోపంతో ఈ సమస్య ఏర్పడుతోంది. నిత్యం రద్దీగా ఉండే కాకినాడ సినిమా రోడ్డులో బుధవారం నాటి దృశ్యమిది. యావత్ నగర ట్రాఫిక్‌ను నియంత్రించే ట్రాఫిక్ డీఎస్పీ కార్యాలయం ఉన్న త్రీ టౌన్ పీఎస్‌కి సరిగ్గా ఎదురుగా పశువులు ఇలా తిష్ట వేసి సగం రహదారిని ఆక్రమించాయి. వాటిని తరలించడానికి పలువురు వాహనచోదకులు విఫలయత్నం చేసి చేసేది లేక వాటిని తప్పించుకుంటూ ముందుకు సాగిపోయారు.

# లబ్ధిని వివరిస్తూ.. అర్హులకు అభయమిస్తూ..

- నేటి నుంచి ప్రభుత్వ పథకాల ప్రచారోద్యమం
- ప్రతి సచివాలయం వద్ద సంక్షేమ బోర్డులు
- ఇంటింటికీ వెళ్లి ప్రజాభిప్రాయ సేకరణ
- తొలి విడత 48 చోట్ల నిర్వహణకు ఏర్పాట్లు

కాకినాడ: నాలుగున్నరేళ్ల ప్రభుత్వ పాలనలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు అందించిన లబ్ధిని వివరిస్తూ.. అర్హత ఉండి ఎవరికైనా ప్రభుత్వ పథకాలు అందకపోతే గుర్తించి న్యాయం చేసే లక్ష్యంతో గురువారం నుంచి 24వ తేదీ వరకు ప్రత్యేక ప్రచారోద్యమానికి శ్రీకారం చుడుతున్నారు. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను ప్రభుత్వం విడుదల చేసింది. ఉన్నతాధికారుల నుంచి వచ్చిన ఆదేశాల మేరకు నగరపాలక సంస్థ యంత్రాంగం ఈ ఏర్పాట్లలో నిమగ్నమైంది. 13వ తేదీ వరకు వివిధ తేదీలలో తొలి విడత 48 సచివాలయాల్లో కార్యక్రమాల నిర్వహణకు షెడ్యూల్ విడుదల చేశారు. ప్రతి సచివాలయం వద్ద 'మా నమ్మకం నువ్వే జగనన్న' పేరుతో ప్రత్యక్ష నగదు బదిలీ, పరోక్ష ప్రయోజనాలను తెలియజేసేలా సచివాలయాల వద్ద సంక్షేమ ప్రదర్శన బోర్డులను ఆవిష్కరించనున్నారు. జగనన్న అమ్మఒడి, విద్యాదీవెన, వసతి దీవెన, విదేశీ విద్యాదీవెన, మత్స్యకార భరోసా, పింఛన్ కానుక, చేయూత, ఆసరా వంటి దాదాపు 25 ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల సంఖ్య, అందించిన సొమ్మును బోర్డుపై రాసి ప్రదర్శించనున్నారు. వీటితో పాటు ఇళ్ల స్థలాల పంపిణీ, విద్యాకానుక, ట్యాబ్‌ల పంపిణీ, జగనన్న తోడు, గోరుముద్ద, కంటివెలుగు వంటి పరోక్ష ప్రయోజనాలను ఆ బోర్డులలో ప్రదర్శించనున్నారు. ఆ మేరకు సచివాలయాల పరిధిలో సమావేశాలు ఏర్పాటు చేసి ప్రజలకు వివరించనున్నారు. ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు వంటి ప్రజాప్రతినిధుల సమక్షంలో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఆ తరువాత సచివాలయ కార్యదర్శులు, వలంటీర్ల ద్వారా రోజుకు 10 నివాసాలకు వెళ్లి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో అందించిన ప్రగతిని వివరించడంతో పాటు పరిపాలన తీరుపై అభిప్రాయ సేకరణ, అర్హత ఉండి పథకాలు అందని లబ్ధిదారులను గుర్తించి న్యాయం చేసే అంశంపై ఇంటింట ప్రచారం చేయనున్నారు.

**ఏర్పాట్లలో అధికారులు**

కాకినాడ నగరపాలక సంస్థ నిర్వహణలో ప్రచారోద్యమానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆయా సచివాలయాల వద్ద ప్రభుత్వం పంపించిన ప్రచార సంక్షేమ బోర్డులను ఆవిష్కరించడం, సభలు పెట్టేందుకు అవసరమైన టెంట్‌లు, ఇతర ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. తొలిరోజైన గురువారాం 9వ డివిజన్ సీతారామనగర్, 18ఎ పరిధిలోని తూరంగిపేట తుఫాన్ షెల్టర్, 27వ డివిజన్ వడ్డీలపేట, 47వ డివిజన్ భానుగుడి సమీపంలో ప్రకాశం వీధి ప్రాంతాల్లో ఈ కార్యక్రమాలు జరగనున్నాయి.



సచివాలయాల వద్ద ఏర్పాటు చేసేందుకు సిద్ధం చేస్తున్న ప్రభుత్వ పథకాల ప్రచార బోర్డులు

**82 వేల కుటుంబాలకు లబ్ధి**



సిటీ నియోజకవర్గంలో దాదాపు 92 వేల కుటుంబాలు ఉండగా సుమారు 82 వేల కుటుంబాలకు సీఎం జగన్ అందించిన సంక్షేమ పథకాలు అందాయి. దాదాపు ప్రతి ఇంటిలో లబ్ధిదారులు ఉన్నారు. నవరత్న పథకాల ద్వారా ఇచ్చిన ప్రతి హామీని అమలు చేశాం. అందువల్లే ఇలాంటి కార్యక్రమాలు ద్వారా చేసిన లబ్ధిని వివరించడంతో పాటు అర్హులకు న్యాయం చేసేందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఈ కార్యక్రమాన్ని తలపెట్టారు.

– ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, సిటీ ఎమ్మెల్యే

**సమావేశాల నిర్వహణకు ఏర్పాట్లు**



ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ప్రతి సచివాలయం వద్ద సంక్షేమ పథకాల లబ్ధిని వివరించే బోర్డులను ఏర్పాటు చేస్తున్నాం. షెడ్యూల్ ప్రకారం ఆయా సచివాలయాల వద్ద సమావేశాలు నిర్వహించి ప్రజలకు ప్రభుత్వ పథకాల లబ్ధిని వివరిస్తాం. అలాగే సచివాలయ కార్యదర్శుల పర్యవేక్షణలో ప్రతి ఇంటికీ వెళ్లి ఇంకా ఎవరైనా అర్హులు ఉండి పథకాలు అందకపోతే గుర్తించి న్యాయం చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

– సీహెచ్ నాగనరసింహారావు, కమిషనర్, నగరపాలక సంస్థ

### ఆదిపూజ్యుడికి వైభవంగా కల్యాణం


సిద్ధి, బుద్ధి సమేత వినాయకుడి కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

బోట్‌క్లబ్: ఆది దేవుడు వినాయకునికి బుధవారం వైభవంగా కల్యాణం జరిగింది. కాణిపాకం వినాయకుడి ఉత్సవ విగ్రహాలతో స్థానిక సూర్యారావుపేటలోని బాలాత్రిపుర సుందరి అమ్మవారి ఆలయంలో ఆలయ కమిటీ చైర్మన్ పెద్ది రత్నాజీ, ఈఓ చింతపల్లి విజయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రముఖ పారిశ్రామిక వేత్తలు కంతేటి కాశీ, సామా రమేష్, పాబోలు చిన్నపున్నయ్య సౌజన్యంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. కాణిపాకం ఆలయ చైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, ఈఓ ఎ.వెంకటేశులు స్వీయ పర్యవేక్షణలో తీసుకొచ్చిన స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు గజల్ శ్రీనివాస్ వ్యాఖ్యానంలో కల్యాణం జరిగింది. సేవ్ టెంపుల్స్ చైర్మన్ గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఆలయం ప్రాముఖ్యత, ఆధ్యాత్మికతను చాటి చెప్పేందుకు దేశ వ్యాప్తంగా తమ సంస్థ ఆధ్వర్యంలో కృషి చేస్తున్నామన్నారు. తొలుత గణపతి హోమం నిర్వహించారు. కౌడా మాజీ చైర్మన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## వైఎస్సార్ సీపీలోకి ఆటో యూనియన్ నాయకులు


వైఎస్సార్ సీపీలోకి చేరిన ఆటో యూనియన్ నాయకులతో ఎమ్మెల్యే కన్నబాబు

కాకినాడ రూరల్: కరప మండలం నడకుదురు గ్రామానికి చెందిన మహాలక్ష్మీ గణపతి ఆటో యూనియన్ నాయకులు వైఎస్సార్ సీపీలోకి ఎమ్మెల్యే కురసాల కన్నబాబు సమక్షంలో చేరారు. రమణయ్యపేట క్యాంపు కార్యాలయంలో బుధవారం నడకుదురు వైఎస్సార్ సీపీ నాయకుడు, సేవాదళ్ అధ్యక్షుడు పైలా గోవిందు ఆధ్వర్యంలో ఆటోయూనియన్ అధ్యక్షుడు పెంచే చంద్రరావు, కార్యదర్శి దేగల రాజు, కాకర్ల దుర్గాప్రసాద్, సురేష్, సబ్బవరపు త్రిమూర్తులు, పాండవకృష్ణ, యండమూరు గోవిందు, ప్రసాద్ తదితరులు వైఎస్సార్ సీపీలో భారీగా చేరారు. వారందరికి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. సీఎం జగన్ నాయకత్వంలో అందరూ వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేయాలన్నారు. కరప జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, పార్టీ నాయకులు జవ్వాది సతీష్, పోతల రాంప్రసాద్, కామిరెడ్డి అంజిబాబు, సామిరెడ్డి శ్రీను, యడ్ల కృష్ణార్జున, మాదవ స్వామి తదితరులు పాల్గొన్నారు.

## సౌకర్యవంతమైన జీవనానికి 'ప్లానింగ్' ప్రధానం

- కౌడా వైస్ చైర్మన్ కొప్పల సుబ్బారావు
- ఉత్సాహంగా వరల్డ్ టౌన్ ప్లానింగ్ డే

కాకినాడ: సమాజంలో సౌకర్యంగా జీవించడానికి ప్రణాళికా విభాగం అత్యంత కీలకమని కాకినాడ అర్బన్ డవలప్‌మెంట్ అథారిటీ (కౌడా) వైస్ చైర్మన్ కొప్పుల సుబ్బారావు పేర్కొన్నారు. స్థానిక స్మార్ట్ సిటీ హాలులో గురువారం టౌన్ ప్లానింగ్–కౌడా ఆధ్వర్యంలో వరల్డ్ టౌన్ ప్లానింగ్‌డే నిర్వహించారు. కౌడా పీవో వి.శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో టౌన్ అండ్ కంట్రీప్లానింగ్ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ ఎం.అరుణవల్లి, కౌడా వైస్ చైర్మన్ కె.సుబ్బారావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. నగరపాలక సంస్థ డిప్యూటీ సిటీప్లానర్ హరిదాసు స్వాగతోపన్యాసం చేశారు. టౌన్‌ప్లానింగ్ సర్వేయర్లు, విశ్రాంత ఉద్యోగులు, బిల్డర్లు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు రిటైర్డ్ ఉద్యోగులను సత్కరించారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. టౌన్‌ప్లానింగ్ విశిష్టతను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కౌడా వీసీ సుబ్బారావు మాట్లాడుతూ విస్తరిస్తున్న నగర, పట్టణ ప్రాంతాల్లో భావి అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేయడం ప్రణాళికా విభాగం పునాది వంటిదని అన్నారు. టౌన్‌ప్లానింగ్ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ ఎం.అరుణవల్లి మాట్లాడుతూ పర్యావరణం, ప్రజారోగ్యం, రవాణా సౌకర్యాల వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుంటూ టౌన్ ప్లానింగ్ చేయాలన్నారు. ప్రభుత్వం ఇచ్చే ఆదేశాలు, జీవోలు, మార్గదర్శకాలను ఆకళింపు చేసుకుని విధి నిర్వహణలో సమర్థవంతంగా పనిచేసినప్పుడే గుర్తింపుతో పాటు సమాజానికి మేలు చేసినవారమవుతామన్నారు. డీసీపీ హరిదాసు మాట్లాడుతూ భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని తీసుకున్న నిర్ణయాల వల్ల కాకినాడకు ప్లాన్డ్ సిటీగా పేరొచ్చిందన్నారు. నగరపాలక సంస్థ కార్యదర్శి ఎం.ఏసుబాబు, డీటీసీపీవో ఎ.సత్యంమూర్తి, ఏసీపీ నాగశాస్త్రులు, ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, కౌడా ఏపీవో కేవీ కృష్ణారావు, కార్పొరేషన్ లీగల్ అడ్వయిజర్ డీవీఎస్ఎన్ మూర్తి, క్రెడాయ్ ప్రతినిధి కె.విజయరామకృష్ణ, ఎల్‌పీటీ అసోసియేషన్ అధ్యక్షుడు ఏవీఎస్ రాజా, ప్రముఖ బిల్డర్ బాదం సుందరరావు, నగరంలోని సర్వేయర్లు, బిల్డర్లు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కౌడ వైస్ చైర్మన్ కొప్పల సుబ్బారావు. చిత్రంలో ఆర్‌డీడీ అరుణవల్లి

## స్వచ్ఛ ఓటరు జాబితాకు సహకరించాలి

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): జిల్లాలో నిర్వహిస్తున్న ఓటర్ల జాబితా సవరణ ద్వారా స్వచ్ఛమైన ఓటరు జాబితాల రూపకల్పనకు రాజకీయ పార్టీలు సహకరించాలని జేసీ ఎస్.ఇలక్కియ కోరారు. కలెక్టరేట్‌లో బుధవారం జేసీ గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటరు జాబితాల సవరణ అంశాలపై సమావేశమయ్యారు. గత నెల 27న జిల్లాలో ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురించనున్నామని, ఈ జాబితాలపై క్లెయిమ్‌లు, అభ్యంతరాలను స్వీకరిస్తామన్నారు. అందిన దరఖాస్తులపై డిసెంబర్ 26 నాటికి పరిష్కరించి, 2024 జనవరి 5న తుది జాబితా ప్రచురించనున్నట్టు తెలిపారు. ఓటరు నమోదు ప్రక్రియలపై ప్రజలను చైతన్య పరుస్తూ జిల్లా వ్యాప్తంగా అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో ఈ నెల 4, 5 తేదీల్లో ప్రత్యేక శిబిరం నిర్వహించినట్లు చెప్పారు. ఈ ప్రక్రియను డిసెంబర్ 2, 3 తేదీల్లో మరోమారు నిర్వహిస్తామన్నారు. ముసాయిదా ఓటర్ల జాబితాలో తప్పులకు సంబంధించి అందిన అభ్యంతరాలపై సమగ్రంగా పరిశీలించి లోపాలు ఉంటే సరి చేస్తామన్నారు. దోష రహిత ఓటర్ల జాబితా రూపకల్పనకు అన్ని రాజకీయ పార్టీలు తమ వంతు సహాయ సహకారాలు అందించాలన్నారు. ఈ సమావేశంలో వివిధ పార్టీలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.


రాజకీయ పార్టీ ప్రతినిధులతో మాట్లాడుతున్న జేసీ ఇలక్కియ

## మండల యూటీఎఫ్ కార్యవర్గం ఎన్నిక


అధ్యక్షుడు శ్రీనివాసరావు


కార్యదర్శి కె.వెంకటరమణ

కరప: మండల యుటీఎఫ్ కొత్త కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాకినాడలోని యూటీఎఫ్ హోమ్‌లో బుధవారం ఆ సంఘం అధ్యక్షుడు టీఎస్ వీఎస్ నారాయణ(శ్రీరామ్) అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా పీవీ సత్యనారాయణ, అధ్యక్షుడిగా ఎలుగుబంట్ల శ్రీనివాసరావు, కార్యదర్శిగా కుడుపూడి వెంకటరమణ, అసోసియేట్ మహిళా అధ్యక్షురాలిగా వాసంశెట్టి తేజ, అసోసియేట్ అధ్యక్షుడుగా ఎస్.సూర్యనందకుమార్, ఆర్థిక కార్యదర్శిగా నందికోళ్ల విష్ణు, కార్యదర్శులుగా వి.శ్రీనివాస్, పి.రాంబాబు, కె.శ్రీనివాస్, సుదర్శన బాబు, పీవీవీ రమణ, వీరబాబు, కేవీవీ రమణ, అర్జున్, నూక రాజు, సోమేశ్వరరావులు ఎంపికయ్యారు. రాష్ట్రకార్యదర్శి అన్నారం మాట్లాడుతూ విద్యారంగం అభివృద్ధికి, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి యూటీఎఫ్ రాజీలేని పోరాటం చేస్తోందన్నారు. జిల్లా అధ్యక్షుడు కేవీవీ నాగేశ్వరరావు మాట్లాడుతూ త్వరలో జరగబోయే యుటీఎఫ్ స్వర్ణోత్సవాలను విజయవంతం చేయాలన్నారు. జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు ఐ.ప్రసాదరావు, కె.పెద్దిరాజు, పేపకాయల రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

## రాగిరెడ్డి సేవలు స్ఫూర్తిదాయకం


కుమార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న శివప్రసన్న, నాయకులు, కార్యకర్తలు

కాకినాడ: వైఎస్సార్ సీపీ అధికారంలోకి రావాలన్న ఆకాంక్షతో పార్టీ అభ్యున్నతికి ఎనలేని సేవలు అందించిన దివంగత రాగిరెడ్డి వెంకట జయరామ్ కుమార్ (ఫ్రూటీకుమార్) సేవలు చిరస్మరణీయమని పార్టీ నగర అధ్యక్షురాలు, మాజీ మేయర్ సుంకర శివ ప్రసన్న పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో కుమార్ 3వ వర్ధంతిని ఆమె అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. కుమార్ చిత్రపటానికి నాయకులు, కార్యకర్తలు నివాళులర్పించారు. నిత్యం ప్రజల మధ్యే ఉంటూ కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ ముఖ్యమంత్రి జగన్, సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి విజయం కోసం కుమార్ ఎంతో పాటు పడ్డారని ప్రసన్న పేర్కొన్నారు. అటువంటి క్రమశిక్షణ కలిగిన నాయకులు మరణించడం కాకినాడలోని పార్టీకి తీరనిలోటన్నారు. కుమార్ అడుగుజాడల్లో ప్రతి కార్యకర్త పనిచేయాలని పిలుపునిచ్చారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బెండా విష్ణు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక నరసన్న నగర్ ప్రాంతంలోని మానవీయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్ కర్రి అనంతలక్ష్మి, నాయకులు నాగమణి ఆధ్వర్యంలో అక్కడి వృద్ధులకు భోజన వితరణ, పండ్ల పంపిణీ జరిగింది.

### పీఆర్‌జీ పూర్వ విద్యార్థుల సమ్మేళనం

బాలాజీచెరువు: పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 1976–79 సంవత్సరంలో బీకామ్ చదివిన విద్యార్థులు బుధవారం స్థానిక కృషిభవన్‌లో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముందుగా కళాశాలకు చేరుకుని అక్కడ తాము చదువుకున్న తరగతి గదులు సందర్శించారు. ఇటీవలే మృతి చెందిన తమ సహాధ్యాయుని కుటుంబానికి పూర్వ విద్యార్థులందరూ రూ.80 వేలు అందజేశారు. అనంతరం తమకు పాఠాలు చెప్పిన డాక్టర్ గొడవర్తి సత్యమూర్తిను సత్కరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పి.గోపాల్, కొడూరి సత్యనారాయణ, పులవర్తి విశ్వనాథం, రాంబాబు పాల్గొన్నారు.

### దివ్యాంగులకు కృత్రిమ చేతుల పంపిణీ

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి, ఎల్లోస్ మెడోస్ ప్రోస్టటిక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఉచితంగా కృత్రిమ చేతులు పంపిణీ చేయనున్నట్టు విభిన్న ప్రతిభావంతులశాఖ సహాయ సంచాలకుడు బి.రామ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.36 వేలు విలువైన ఈ కృత్రిమ చేతులు అధునాతనమైనదన్నారు. మోచేయి కింద కనీసం నాలుగు అంగుళాలు చేయి కలిగిన దివ్యాంగులు ఎవరైనా వీటిని పొందవచ్చునన్నారు. ఆసక్తి గల వారు 72074 08150 నెంబర్‌కు ఫోన్ చేసి పేరు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు.

### వైఎస్సార్ టీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడిగా సుధాకర్

బాలాజీచెరువు: వైఎస్సార్ టీచర్ ఫెడరేషన్ జిల్లా గౌరవ అధ్యక్షుడిగా నల్లా విజయ సుధాకర్ బుధవారం ఏకగ్రీవంగా నియమితులయ్యారు. భానుగుడి జిల్లా కార్యాలయంలో జిల్లా వైఎస్సార్ టీఎఫ్ అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించి ఈ నియామకం చేపట్టారు. ఈయన తుని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహించి పదవీ విరమణ చేశారు. సుధాకర్‌ను వైఎస్సార్ టీఎఫ్ ప్రధాన కార్యదర్శి శరత్‌చంద్ర, వర్కింగ్ ప్రెసిడెంట్ వీరవల్లి గోపీకృష్ణ అభినందించారు.

### ఘనంగా నన్నయ జయంతి

కాకినాడ రూరల్: బోట్‌క్లబ్ వద్ద ఆదికవి నన్నయ జయంతిని వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. నన్నయ విగ్రహానికి ప్రొఫెసర్ విశ్వనాథరావు, అడబాల రత్నప్రసాద్, చింతపల్లి సుబ్బారావు, రెడ్నం రాజా, రామారావు తదితరులు నివాళులర్పించారు.

## తిరుమలేశుని దర్శించిన నేతలు


వేంకటేశ్వరస్వామి సన్నిధిలో ఎమ్మెల్యే ద్వారంపూడి, నాయికులు, కార్యకర్తలు

కాకినాడ: సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి మహాలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో ఇక్కడి పార్టీ నేతలు బుధవారం తిరుమల వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. గడచిన ఎన్నికల్లో పార్టీ విజయం సాధించి సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి గెలిస్తే తిరుపతి నుంచి తిరుమలకు కాలినడకన వస్తామని అప్పట్లో చేసిన మొక్కు మేరకు అక్కడకు వెళ్లారు. సుమారు 120 మంది ఎమ్మెల్యేతో పాటు మూడు బస్సులలో తిరుమల చేరుకుని బుధవారం వేంకటేశ్వరస్వామి దర్శనం చేసుకున్నారు. ఆయన వెంట ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, పార్టీ ముఖ్యనేతలు సుంకర విద్యాసాగర్, రాగిరెడ్డి సుబ్బారావు, మాజీ కార్పొరేటర్లు, నాయకులు ఉన్నారు.

## నాణ్యమైన ఎరువులు అందించాలి

- జేడీఏ విజయ్‌కుమార్

కరప: వ్యాపార దృక్పథంతో కాకుండా సేవే ధ్యేయంగా రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందించాలని జిల్లా వ్యవసాయ సంయుక్త సంచాలకుడు ఎస్.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశమందిరంలో బుధవారం కరప సబ్ డివిజన్ పరిధిలోని కరప, కాజులూరు, తాళ్లరేవు మండలాల డీలర్లు, వీఏఏలు, ఏఈఓలతో ఆయన సమీక్షించారు. లైసెన్స్ లేకుండా వ్యాపారం చేసినా, నిబంధనలు అతిక్రమించినా బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రబీలో అనధికార హైబ్రిడ్, ఇతర రకాల విత్తనాలు విక్రయించడం వల్ల నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాల్సి ఉంటుందన్నారు. విత్తన విక్రయాల్లో తేడా వస్తే ఎంఏఓలు, డీలర్లు బాధ్యత వహించాలన్నారు. ఏడీఏ కె.బాబూరావు మాట్లాడుతూ లైసెన్స్‌లో పేర్కొన్న డోర్ నంబరులోనే డీలర్లు వ్యాపారాలు నిర్వహించాలన్నారు. అనంతరం రబీలో వరి యాజమాన్య పద్ధతులు, అనుసరించాల్సిన మెళకువలను జిల్లా వనరుల కేంద్రం డీడీఏ బి.హరి, ఏడీఏ పి.మాధవి సమగ్రంగా వివరించి, వీఏఏలు, ఏఈఓలకు అవగాహన కల్పించారు. కరప సబ్‌డివిజన్ ఏడీఏ కె.బాబూరావు, కరప, కాజులూరు, తాళ్లరేవు మండలాల ఏఓలు ఏవీ రాజేష్, వి.అశోక్, ఎన్.ప్రశాంతి, టెక్నికల్ ఏఓలు పద్మజారాణి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జేడీఏ విజయ్‌కుమార్

## జాతీయ చెస్ పోటీలలో జయప్రకాశ్ ప్రతిభ

- కాంస్య పతకం, రూ.30 వేల నగదు గెలుపు

కరప: జార్ఖండ్ రాష్ట్రంలోని జంషెడ్‌పూర్‌లో జరిగిన 36వ జాతీయ అండర్–9 బాలురు, బాలికల చెస్ చాంపియన్‌షిప్–2023 పోటీలలో కూరాడ గ్రామానికి చెందిన వనుం జయప్రకాష్ ప్రతిభ చూపి బ్రాంజ్‌మెడల్, రూ.30 వేలు నగదు గెలుపొందాడు. కాకినాడలోని కేంద్రీయ విద్యాలయలో జయప్రకాష్ నాలుగో తరగతి చదువుతున్నాడు. జంషెడ్‌పూర్‌లో ఈనెల 2వ తేదీ నుంచి బుధవారం (8వ తేదీ) వరకు అండర్–9 విభాగంలో చెస్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. వివిధ రాష్ట్రాల నుంచి 252 మంది పాల్గొనగా మహారాష్ట్రకు చెందిన అద్విక్ అమిత్ అగర్వాల్ ప్రథమ స్థానంలో నిలచి స్వర్ణ పతకంతో పాటు రూ 60 వేలు, పాండిచ్చేరీకి చెందిన రాహుల్ రామకృష్ణ ద్వితీయ స్థానంలో నిలచి రజత పతకంతో పాటు రూ.40 వేలు నగదు గెలుచుకోగా జయప్రకాష్ తృతీయస్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని నగదు బహుమతి గెలుచుకున్నట్టు విద్యార్థి తండ్రి వనుం వెంకటరమణ బుధవారం రాత్రి స్థానిక విలేకరులకు తెలిపారు. జయప్రకాష్‌ను జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, సర్పంచ్ వాసంశెట్టి కొండ అభినందించారు.


నిర్వాహకుల నుంచి కాంస్య పతకం, నగదు బహుమతి తీసుకుంటున్న జయప్రకాశ్

### కార్తిక మాసంలో దర్శన వేళల పెంపు

పిఠాపురం: స్థానిక పాదగయ క్షేత్రంలో ఈ నెల 14వ తేదీ నుంచి వచ్చే నెల 12వ తేదీ వరకు కార్తిక మాసోత్సవాలు నిర్వహించనున్నారు. కాగా కార్తిక మాసంలో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ దర్శన వేళలు పెంచినట్లు ఈఓ శ్రీనివాసరావు తెలిపారు. ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ ఆగంటి ప్రభాకరరావు అధ్యక్షతన బుధవారం కార్తిక మాసం ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ మాసంలో ప్రతి రోజూ తెల్లవారు జామున 3 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ, సాయంత్రం 3 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకూ భక్తులకు కుక్కుటేశ్వరస్వామి దర్శనం కల్పిస్తామన్నారు. సోమవారం, ఇతర పర్వదినాల్లో తెల్లవారుజామున 3 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకూ ఆలయం తెరచి ఉంచాతామని తెలిపారు.

## రెండు కార్లు ఢీ : ముగ్గురికి గాయాలు

కాకినాడ రూరల్: స్థానిక సిద్ధార్థనగర్ ఆర్టీవో కార్యాలయం సమీపంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పలువురు గాయపడ్డారు. ప్యారీ షుగర్స్‌లో పనిచేసే వారితో టవేరా వాహనం వస్తూ ఆర్టీవో కార్యాలయం కూడలి దాటిన తరువాత కొద్ది దూరంలో డివైడర్ మధ్య నుంచి కుడిచేతి వైపు మలుపు తిరుగుతుండగా ఎక్స్‌యూవీ వాహనం అతి వేగంతో టవేరాను ఢీకొట్టి పక్కనే ఉన్న డ్రైనేజీని దాటి ఖాళీస్థలంలోకి వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో టవేరాలో ఉన్న ప్యారీ షుగర్స్ మేనేజర్ ప్రకాశరావుకు బలమైన గాయాలు కాగా, భుజంపై బలమైన గాయమైంది. అలాగే మరో ఉద్యోగి సుబ్బారావుకు గాయాలయ్యాయి. పెదపూడికి చెందిన డ్రైవర్ చిన్నయికుమార్ తలకు గాయమైంది. అతివేగంతో టవేరాను ఢీకొట్టిన ఎక్స్‌యూవీ వాహనంలో ముగ్గురు యువకులు ఉన్నట్టు తెలిసింది. వీరు ప్రమాదం జరిగిన వెంటనే కారు వదిలి పారిపోయారు. మరో వైపు ప్యారీ షుగర్ మేనేజర్, డ్రైవర్‌తో సహ ముగ్గురు కారులో ఇరుక్కుపోవడంతో వారిని స్థానికులు వాహనం డోర్లు బలవంతంగా లాగి కాపాడారు. బాధితులు ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. అతివేగం కారణంగానే ప్రమాదం జరిగిందని సర్పవరం సీఐ మురళీకృష్ణ తెలిపారు. ఎస్సై అజయ్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ప్రమాదంలో ధ్వంసమైన టవేరా, ఎక్స్‌యూవీ వాహనాలు